# ఆత్మాభిమానం

గోడగడియారం ఠంగు ఠంగుమంటూ పది కొట్టింది.

దొడ్లో బావి దగ్గర స్నానం చేస్తున్న గురునాథం గుండెలో రైళ్ళు పరుగెత్తసాగాయి. తల మీద రెండు చేదలు కుమ్మరించుకుంటూనే, 'ఎవరైనా వచ్చారా?' అడిగాడు బిగ్గరగా. కంఠస్వరంలో ఆదుర్దా కనపించింది.

ఠపీమని గంట కొట్టినంత స్పష్టంగా సమాధానం వినవచ్చింది. 'మేత బ్రాహ్మడే వచ్చాడు.'

తద్దినాలంటే ఆదరభావం అంతగా లేని పెద్ద కొడుకు విసుక్కుంటూ చెప్పిన సమాధానమని గురునాథం గ్రహించకపోలేదు. ఆ రోజు ఏ ఆదివారమో అయితే కొడుకుని గట్టిగా మందలించేవాడే, అలా చెప్పినందుకు, ఇవాళ తాను ఆఫీసులో ఒంటిగంటకల్లా ఉండితీరాలి. అతికష్టం మీద అంతమాత్రమైనా సెలవంటూ దొరికింది. తన పట్ల ఎంత గౌరవం ఉన్నా, మేనేజరు మాత్రం ఏం చేస్తాడని! హెడ్డాఫీసు నుంచి పై అధికారులు తనిఖీ చేసేందుకు వస్తున్నారు. పైగా తాను నిర్వహిస్తున్నది బాధ్యతాయుతమైన పని. ఆఫీసు లెక్కడొక్కలన్నీ గత ఆరేళ్ళుగా తన పర్యవేక్షణలోనే సాగుతున్నాయి. అది స్ఫురణకు రాగానే గురునాథం ఒంటి మీద తేళ్ళు జెర్రులు పాకినట్లనిపించింది. సహనం తగ్గుముఖం పట్టింది. 'నెత్తీ నోరు బాదుకున్నా యీ బ్రాహ్మలు వస్తానన్న వేళకి రారు. పదింటికల్లా రావాలని చిలక్కి చెప్పినట్లు చెప్పివచ్చాను. వాళ్ళకేం తెలుస్తాయి. నా యిబ్బందులు...' లోలోన గొణుక్కున్నాడు.

తండ్రి గొణగుడు తనయుడికి స్పష్టంగా వినిపించలేదు. లేకపోతే ఆయన అసహనానికి శృతి కలిపేవాడే. 'కూత బ్రాహ్మడు కూడా

వచ్చినట్లున్నాడు...' ఆలస్యంగా నడుస్తున్న రైలు రాకను తెలిపే పోర్టరు గంటలా తోచింది గురునాథానికి. పోతున్న ప్రాణం తిరిగి వస్తున్నట్లనిపించింది. కొంచెం ఆలస్యంగానైనా వచ్చాడు... అమ్మయ్యా. అనుకున్నాడు. బాధానివారణ కలిగిన వానిలా కనిపించాడు.

'రండి రండి శాస్త్రుల్లుగారు...'

'క్షమించాలి. కొంచెం ఆలస్యమయింది.'

'ఫరవాలేదు లెండి, మీరు వచ్చారు. అదే పదివేలు...'

'పదింటికల్లా యిక్కడ వాలాలనుకున్నా. సరిగ్గా బయలుదేరుతుంటే శనిగ్రహంలా దాపరించాడు, మా దూరపుచుట్టం ఒకాయన. చేబదులుగా ఒక వంద వుంటే సర్దమని పీక్కుతిన్నాడు. ఆయన్ని వదిలించుకుని బయట పడేసరికి తలప్రాణం తోకకి వచ్చిందంటే నమ్మండి..'

'త్వరగా మీరు స్నానం చేసిరండి. మొదలు పెడదాం...' అంటూ గురునాథం తడిబట్టతో లోపలికి వెళ్ళబోయాడు.

'ఇంకో భోక్త రాలేదే. చివరికి అభాసు చేస్తాడో ఏమిటో...'

'మంత్రం చెప్పి, మీరే భోక్తగా కూర్చోండి. సరి పోతుంది.'

'మీ మాటను ఎన్నడైనా కాదన్నానా...కాని...'

'ఏమిటో సందేహిస్తునారు శాస్త్రులు గారు...'

'మరేం లేదు. ఇక్కడ పని పూర్తి చేసుకుని, మా బావగారింటికి వెళ్ళాలి. వాళ్ళింట్లో యివాళ ఆబ్దికం...'

గురునాథంలో అసంతృప్తి నెలకొన్నది. 'సరే, మీ యిష్టం. మీరు కానిస్తుంటే మధ్యలో ఆ భోక్తగారు వస్తే సంతోషం లేకపోతే ఒక్కభోక్తతోనే పని జరిపించండి...'

లోపలికి వెళ్ళిన గురునాథం ఖళ్ళీ దొడ్లోకి వచ్చి స్నానం చేస్తున్న శాస్త్రుల్లుగారిని అడిగాడు. 'రెండో భోక్త ఎవరు!'

'మీకు తెలిసే వుండచ్చు. నారాయణమూర్తిగారని...ఏదో ఆఫీసులో ఉద్యోగం చేసి యీ మధ్యే రిటైరయ్యారు...'

'నారాయణమూర్తిగారా!'

'సన్నగా పొడుగ్గా వుంటారు. మనిషి కొంచెం నలుపు...'

'గౌరీ శంకరపురంలో వుంటారనుకుంటాను.'

'ఆయనే!' 'అక్కడ డాబా యిల్లొకటి వుండాలి!

స్నానం ముగించుకుని అంగవస్త్రం కట్టుకుని శాస్త్రుల్లుగారు ధోవతి ఆరవేస్తూ 'ఆయనే నండి' అన్నాడు.

'ఈ వృత్తిలోకి ఎందుకు దిగినట్టు?' ప్రశ్నార్థకంగా చూశాడు గురునాథం.

'ఇప్పుడా కథ మొదలు పెడితే సాయంకాలమవుతుంది...' అంటూ తడి అంగవస్త్రంతోనే ఆయన తద్దినంపెట్టే గదిని చేరుకున్నాడు. స్నానాదికం పూర్తి చేసుకుని అంతకుముందు వచ్చిన బ్రాహ్మడు దొప్పలు కడుతున్నాడు.

తనలా అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పని చేసిన నారాయణమూర్తిగారెందుకు యీ వృత్తిలోకి దిగాడా! అని గురునాథం ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడాయన మనస్సు తద్దినం మీద లేదు.

గేటుచప్పుడయింది.

మంత్రం చెపుతున్న శాస్త్రుల్లుగారు వీధి వైపు తొంగి చూశాడు. వీధి వాకిలి తెరిచిన సవ్వడి వినిపించింది.

'రండి, రండి బాబుగారు... మీ కోసమే ఎదురు చూస్తున్నారు. తిన్నగా దొడ్లోకి వెళ్ళి బావి దగ్గర స్నానం చేసి త్వరగా రండి...'

గురునాథం భార్య మాటలు వినిపించేసరికి శాస్త్రుల్లుగారి మనస్సు సంతోషంతో నిండి పోయింది. గురునాథంలో తహ తహ ఎక్కువయింది. శ్రద్ధలోపించసాగింది. వచ్చినాయనేనా నారాయణమూర్తి...

'సాక్షాత్తూ ఆ నారాయణమూర్తిలా వచ్చారు 'మీరు సమయానికి.. మీ స్థానంలో నేనే కూర్చుందామనుకున్నాను...' శాస్త్రుల్లుగారి చివరి మాటలు గురునాథానికి స్పష్టంగా వినిపించలేదు. 'రండిసార్' అన్నాడు అలవాటు కొద్దీ.

నిజాయితీ గల ఆఫీసరుగా బతికినవాడు..సంఘంలో పేరున్నవాడు. సొంతయిల్లూ వాకిలీ వున్నవాడు. కొద్దిగానో గొప్పగానో డబ్బుదస్కం గల

వాడు. బ్రాహ్మణార్థాలకు ఎందుకు దిగినట్టు... పరిస్థితుల ప్రభావం వల్లనా... గురునాథం మనస్సుని వేధించసాగాయి.

మాతృయజ్ఞం ముగిసింది.

వచ్చిన బ్రాహ్మణుల్ని యథోచితంగా సత్కరించాడు. తాననుకున్న వేళకే గురునాథం ఆఫీసు చేరుకున్నాడు. అంతా సక్రమంగా జరిగింది. కాని మనస్సులోని సందేహాలు తొలగిపోలేదు.

రెండు వారాలు గడిచాయి.

ఒకనాడు కూరల మార్కెట్టులో తలవని తలంపుగా గురునాథానికి ఎదురయ్యాడు నారాయణమూర్తి.

'ఆ రోజు మిమ్మల్ని చూసిన లగాయతు నా మనస్సెందుకో మీ గురించే ఆలోచించసాగింది...'

'అదంతా ఇప్పుడనుకుని ఏం లాభం చెప్పండి. స్వయంకృతాపరాధం!'

'మీరు తప్పు చేశారా?'

'మంచి ఉద్దేశంతో చేశాను. చివరికి బెడిసికొట్టింది...'

'క్షమించాలి. నాకు సరిగ్గా అర్థంకాలేదు.'

ఆ తరువాత యిద్దరూ కొన్ని క్షణాలు మౌనం వహించారు.

'రేపు ఉదయం మీరు నా ఆతిథ్యం స్వీకరిస్తే నాకది పరమ సంతోషం' అప్రయత్నంగా అన్నాడు గురునాథం.

'అలాగే, మీలా ఆప్యాయంగా నన్ను భోజనానికి రమ్మని పిలిచే వాళ్లెవరున్నారు. చెప్పండి. పదకొండు ఆ ప్రాంతాన వస్తే, మీకేమీ యిబ్బంది వుండదు గదా!'

'మీ యిష్టం. తమ వంటి పెద్దలు మా యింటికి రావడం నా అదృష్టం..'

'అన్నట్టు మరచిపోయాను. మీరు ఆఫీసుకి వెళ్ళాలి.

'రేపు ఆదివారం కదండీ...'

'ఏమిటో అన్ని వారాలూ ఒకలాగే వున్నాయి. రిటైరయిన తర్వాత...' అంటూ నారాయణమూర్తి సెలవు తీసుకున్నాడు. ఆయన వెళ్ళినవైపు

చూస్తూ నిలబడిపోయాడు కొంతసేపు, గురునాథం. పూర్వం ఎంత చలాకీగా వుండేవాడో యిప్పుడంత మందకొడిగా కనిపించాడు!

ఆదివారం నాడు గురునాథం యిల్లు మహా సందడిగా ఉంది. టీ.వి. మోగుతున్నా సరే, నచ్చిన క్యాసెట్లు పెట్టుకుని పాటలు వినడం అయన పెద్దకొడుక్కి అలవాటు. ఇంటి విషయాలేవీ పట్టించుకోకుండా పెద్ద కూతురు ఒక మూలకూర్చుని నవల చదువుతూవుంటుంది. బోర్ కొట్టినప్పుడు ఎవ్వరూ లేకపోయినా, ఒంటరిగానే క్యారమ్స్ ఆడుతుంది. చిన్న కొడుకూ, చిన్నకూతురూ ఆటల్లో మునిగి తేలుతూ వుంటారు. తనకు నలభై ఏళ్ళు వచ్చినా వంటింటి బాధ్యత రోజురోజుకి ఎక్కువవుతోంది కాని తగ్గడం లేదని అయన భార్య తీరిక చిక్కినప్పుడల్లా భర్త వద్ద తన గోడు వెళ్ళబోసుకుంటుంది.

భోజనానంతరం మేడమీద గదిలో అయన నారాయణమూర్తి యోగ క్షేమాలు కనుక్కోసాగాడు.

'ప్రస్తుతం నేను విడిగా వుంటున్నానన్నారు, భోజనం చేస్తూ, మీ అబ్బాయిగారు యీ వూళ్ళోనే గదా వుంటున్నారు..' సందేహిస్తూ అడిగాడు గురునాథం.

అయన సమాధానం చెప్పడానికి తటపటాయించడం గ్రహించి గురునాథం అన్నాడు, బాధపడుతూ, 'క్షమించండి. వ్యక్తిగత విషయం అడిగినందుకు...'

'మీరడిగింది ఒకందుకు మంచిదే అయింది. ఆత్మీయులకు చెపితే, మనసులోని బాధ కొంత వరకైనా తగ్గిపోతుంది...' అంటూ ప్రారంభించాడు నారాయణమూర్తి. మాటలో స్పష్టత కానవచ్చినా, మనసులోని బాధ తొంగి చూస్తోంది.

'మా అబ్బాయీ నేను మొన్నమొన్నటి దాకా కలిసే వుండేవాళ్ళం. వాడు నాకు ఏకైక సంతానం. మా కోడలు కూడా మంచిదే. నా భార్య గతించినప్పటి నుంచీ నా కెలాంటి కొరత రానీయకుండా ఆప్యాయంగా చూసేది. మనసెరిగి మసులుకునేది. నిజం చెప్పాలంటే, మా అబ్బాయి

కంటే మా కోడలే నా విషయంలో ఎక్కువ ఆసక్తి చూపేది. వాడి ప్రవర్తన చుట్టం చూపులా వుండేది. మొదటి నుంచీ వాడి తరహా అంతే. సరిపెట్టు కోవడం అలవాటయింది. అందువల్ల యింట్లో మంచి చెడూ అంతా ఆమే చూసుకునేది. పెత్తనమంతా ఆమెదే. చివరికి నా పెన్షన్ కూడా ఆమె చేతికే యిచ్చేవాణ్ణి. ఎప్పుడు డబ్బు కావాలన్నా అడిగి తీసుకునేవాణ్ణి...'

'నిజంగా మీరు అదృష్టవంతులే! ఈ రోజుల్లో అలాంటి కోడలు దొరకడం అరుదని పిస్తోంది.

'నేను మొదట్లో అలాగే అనుకుని మురిసిపోయాను. అదంతా నటన అని తెలుసుకునేందుకు చాలా కాలం పట్టింది...' గొంతు గాద్గదిక మయింది.

గురునాథం ఆయన వంక ఆశ్చర్యంగా చూశాడు. కొంచెం సేపు మౌనం అలముకుంది.

'ఆ అతి వినయ విధేయతలు ధూర్తలక్షణాలని గ్రహించలేకపోవడం నా అవివేకం. అది నేను చేసిన మొదటి తప్పు. అలా అన్ని తప్పులకి దారి తీసింది నా అవివేకం...'

'మీ బాధ అర్థమవుతోంది మూర్తిగారు...'

'ఇప్పుడు మా కోడల్ని తప్పుపట్టి యేం లాభం చెప్పండి. ఇది కూడా అవివేకమే!' ఉన్నట్టుండి ఆయన భావోద్వేగానికి వశుడయ్యాడు.

'మీ అబ్బాయిగారు పైన ఇల్లు వేయాలనుకుంటున్నారు. పెద్ద మనవడేమో కింద, చిన్న మనవడేమో పైన వుంటే- అంతా ఒకే యింట్లో వున్నట్టుగా వుంటుందని ఆయన అభిప్రాయపడుతున్నారు అంటూ మా కోడలు నేను టిఫిన్ చేసేటప్పుడు మొదలు పెట్టింది. అందరం ఒకే యింట్లో వుండటం చాలా మంచిదమ్మా అన్నాను...'

'అవునవును. ఖర్చులు చాలా కలిసొస్తాయి. కాని యీ రోజుల్లో ఎవరికి వారు విడివిడిగా వుండాలని కోరుకుంటున్నారు...' గురునాథానికి తన పెద్ద కొడుకు గుర్తుకు వాచ్చాడు. నిస్పృహ గోచరించింది ముఖంలో, నిరుత్సాహం కనిపించింది మాటల్లో.

'నా సొద మీకు విసుగనిపించడం లేదు గదా...'

'మూర్తిగారూ, యివ్వాళ్ళ మీరు బాధ పడుతున్నారు. రేపు నా వంతవుతుంతో యేమిటో...'

'అబ్బే, అలా ఎందుకనుకోవాలి? అందరూ అలా చేస్తారనుకోవడం పొరపాటు...'

'అవుననుకోండి. కాని మన సమాజంలో నయవంచకత్వం నానాటికీ పెరిగిపోతోంది...'

'మంచి మాటన్నారు గురునాథం గారు! మా కోడలూ, మా అబ్బాయీ చేసింది సరిగ్గా నయవంచకత్వమే. ఇల్లు ఆయన పేరు వుంటేనే గాని బ్యాంకు వారు ఆయనకి లోను యివ్వమని ఖచ్చితంగా చెప్పారు, మరి ఆయన వద్దేమో సరిపడ్డ డబ్బు లేదాయే, ఈ సంగతి మీతో చెప్పడానికి ఆయన యిదై పోతున్నారని మా కోడలు చెప్పేసరికి, అబ్బాయి పేరుకి యిల్లు రాస్తానని ఆలోచనా గట్రా ఏమీ లేకుండా అనేశాను...'

'అవున్లేండి, మన తదనంతరం మన ఆస్తి పాస్తులు సంతానానికే గదా సంక్రమించేది!'

నారాయణమూర్తి ఒక్కసారి గురునాథాన్ని పరీక్షగా చూశాడు.

'మీ మాటని నేను కాదనడం లేదు. మీలా నేనూ అనుకుని చివరికి గోతిలో పడ్డాను. ఇదంతా నా అవివేకం...'

ఇద్దరూ మౌనం వహించారు. ఆయన మనస్సుని నొప్పించడానికి గురునాథానికి మనస్కరించలేదు.

'గురునాథం గారూ...'

'చెప్పండి మూర్తి గారూ...'

'మీకు తెలియని విషయమని కాదు. అయినా అనుభవం ద్వారా గ్రహించిన విషయాన్ని మీకు చెప్పడం మంచిదేమో అనిపిస్తోంది...మీరు మాత్రం నేను చేసిన తప్పు ఎప్పుడూ చేయవద్దని నా మనవి...'

'అంటే, యింటిని కొడుకుల పేర రాయడం మంచిది కాదంటారా?'

'నేనలా చెప్పడం లేదు. నా తదనంతరం కొడుకులకి చెందాలని రాయడం మంచిదని నా అభిప్రాయం.. నా అవివేకం కొద్దీ, యింటిని మా

అబ్బాయి పేర రాయడం తరువాయి...' ఆయన కళ్ళు మీటి బుంగలయినాయి. మాట పెగలలేదు.

బాబుగారూ కాఫీ తీసుకోండి... అంటూ అక్కడికి గురునాథం భార్య వచ్చింది. కాఫీ కప్పు ఆయన చేతికి అందించింది, లేకుంటే... ఆయన కళ్ళవెంబటి బొటబొటా మంటూ నీళ్ళుకారి వుండేవి. కాఫీ మెల్లమెల్లగా తాగుతూ అన్నాడు.' ఆ తర్వాత నన్ను చీడపురుగులా చూడసాగారు..దుర్భాషలాడారు. ఆ వినయం ఆ విధేయత ఆ ఆప్యాయత మా కోడలిలో కలికానికైనా కనిపించలేదు. మా అబ్బాయి అయితే.. త్రాష్టుడు...'

ఆయన మాటలకి అడ్డు తగిలినట్టుగా, గురునాథం చిన్న కూతురు వేడి వేడి గారెల పళ్ళాలతో అక్కడికి వచ్చింది.

ఆవురువురు మంటూ గారెలు తినసాగిన మూర్తిని దీక్షగా చూశాడు గురునాథం. మనస్సులో తెలియని తృప్తి, భావం ఏదో నెలకొన్నది.

'ఇలాగారెలు వేడివేడివి తిని ఎన్నాళ్ళయిందో... తృప్తిగా తినమరిగిన ప్రాణం. వేరే దోవ లేక బ్రాహ్మణార్థాలకు దిగవలసి వచ్చింది. అలా కడుపు నింపుకోవడం నాకు న్యూనతగా తోచింది. కాని ఏం చేయను...'

'నిజమే కావచ్చు. అన్న పానాలకు లోటు లేకుండా బ్రతికి చివరికి ఆత్మాభిమానం చంపుకుని రోజులు వెళ్ళబోసే పరిస్థితికి వచ్చాను. మీరేమన్నా సరే, యీ దుర్గతికి నా అవివేకం కారణం. లోక జ్ఞానంతో సంచరించక పోవడమూ కారణమే అనుకుంటున్నా...'

'మూర్తిగారూ, మీరేమీ అనుకోకపోతే ఒక విషయం మనవి చేస్తాను.'

'సందేహించకుండా చెప్పండి.'

'నాకు బాగా తెలిసిన ఒక కంపెనీలో పార్ట్‌టైం అక్కౌంటెంట్ కావాలని అడిగారు...'

గురునాథం మాట పూర్తి చేసేంత లోపల 'అయ్యా, శక్తి వంచన లేకుండా ఆ పని చేస్తాను. మీ కెంతో పుణ్యం వుంటుంది. రేపే చేరి, ఆత్మాభిమానం నిలుపుకుంటాను...' అన్నాడు మూర్తి.

'రేపొకసారి మా ఆఫీసుకి రండి. అక్కడికి తీసుకెళ్ళి మిమ్మల్ని పరిచయం చేస్తాను' అంతులేని సంతోషం చెందాడు గురునాథం.

నారాయణమూర్తిలో తొంగి చూసిన ప్రేతకళ తొలగిపోయింది.

'పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టనిపిస్తోంది... మీ మేలు మరిచిపోను. మీరు మాత్రం నాలా తొందరపడి యిల్లు కొడుకుల పేర రాయకండి...' అంటూ లేచాడు ఆయన.

గురునాథం కళ్ళ ముందు పెద్ద కొడుకు ప్రత్యక్షమయ్యాడు.